# డిగ్నిటీ

డాక్టర్! అర్జెంట్‌గా చూడవలసిన కేసొకటి వచ్చింది" కాంపౌండర్ హడావిడిగా వచ్చి చెప్పాడు పేషెంట్స్‌ని చూస్తున్న నాతో.

"ఏం జరిగింది ?" అడిగాను.

"ఒకతనికి కుడిచేతికి బాగా గాయం అయింది. రక్తం కారుతోంది. పక్క గదిలో వున్నాడు."

"పదయితే" అని లేచాను.

కన్సల్టింగ్ గదిలోంచి మందులుంచిన పక్క గదిలోకి వెళ్ళాను. ఆ పేషెంట్ కుర్చీలో కూర్చుని వున్నాడు. కుడిచేతికి తడిపిన నాప్‌కిన్ కట్టుకుని వున్నాడు. రక్తం ఇంకా కారుతున్న గుర్తుగా నేప్‌కిన్ ఎర్రగా వుంది.

దగ్గరకి వెళ్ళి నేప్‌కిన్ విప్పుతూ ఆ పేషెంట్ మొహంలోకి చూశాను.

"ఎలా జరిగింది ?" అడిగాను.

అతని మొహం క్షణాలలో పాలిపోయింది. నా వంక చూడలేక కళ్ళు దించుకున్నాడు. తర్వాత తల వంచుకున్నాడు సిగ్గుగా.

తెల్లటి యూనిఫారంలో వున్న, అతని వెంట వచ్చిన ఒకతను చెప్పాడు.

"సోడా సీసా ఓపెనర్‌తో తెరుస్తూంటే చేతిలోనే పగిలింది ఆ సీసా."

"గాయం బాగా అయింది" అన్నాను అతని చేతిని పరిశీలనగా చూసి.

కొన్ని క్షణాల తర్వాత తలఎత్తి నా కళ్ళలోకి చూశాడా పేషెంట్ గుర్తు పట్టానతన్ని.

అతను అమరనాథ్. నాకు అంతకు ముందే పరిచయస్తుడు కొద్దిగా.

* * *

దాదాపు పదిరోజుల క్రితం విజయవాడ రైల్వేస్టేషన్‌లో పన్నెండు ముప్పావుకి దిగి సరాసరి సూర్యారావుపేటలో వున్న అన్నయ్య ఇంటికి వెళ్ళాను. నాతోపాటు హైద్రాబాద్ నుంచి వచ్చిన సత్యానంద్ కూడా ఉన్నాడు.

మేం వస్తున్నట్లుగా ముందే ఉత్తరం రాయటం వల్ల పెద్ద వదిన మా కోసం వేడి నీళ్ళు సిద్ధంగా వుంచింది మేం స్నానాలుచేసి భోజనానికి కూర్చున్నాము.

"ఎన్నింటికి రమ్మన్నారు ?" అడిగాను సంగతి కదుపుతూ.

"నాలుగున్నర తర్వాత వర్జ్యం వుండదు. అయిదున్నర, ఆరు మధ్య తిథి నక్షత్రం బావున్నాయిట. వాళ్ళబ్బాయి వచ్చి తీసుకెళ్తాడని కబురు చేశాడాయన" పెద్దన్నయ్య చెప్పాడు.

"అయితే నే కాసేపు నడుం వాల్చవచ్చన్నమాట."

భోజనాలు అయ్యాక చెప్పింది వదిన నాతో.

"నాలుగున్నరకి లేపుతాను. ఆ అబ్బాయి వచ్చేసరికి తయారయి వుంటే వెంటనే వెళ్ళొచ్చు."

"మీకెలా వుంది వదినా ఆ పిల్ల ?" అడిగాను.

"నాకయితే చాలా నచ్చింది. మీ తమ్ముడికి తప్పక నచ్చుతుంది. కట్న కానుకలే ముఖ్యం కాదనుకుంటే, జాతకాలు కుదిరితే చాలు. ఈ ఈ సంబంధం ఖాయం అవుతుందనిపిస్తోంది."

మధ్యగదిలో పందిరి పట్టెమంచం మీద పడుకున్నాను. పెద్దన్నయ్య

చిన్న కొడుకు టేబిల్ ఫేన్‌ని నాకు గాలి తగిలేలా అమర్చి ఆన్ చేశాడు. సత్యానంద్ పిల్లలతో కేరమ్స్ ఆడటానికి కూర్చున్నాడు.

నాలుగున్నరకి లేపాడు పెద్దన్నయ్య. చన్నీళ్ళతో మొహం కడుక్కుని వదిన ఇచ్చిన వేడి వేడి కాఫీ తాగాక ప్రయాణ బడలిక తగ్గినట్లనిపించింది.

అయిదుంపావుకి వచ్చాడు పెళ్ళికూతురు అన్నయ్య. సత్యానంద్‌ని, నన్ను పరిచయం చేశాడు పెద్దన్నయ్య అతనికి.

ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి అతనికి. సన్నగా తెల్లగా వున్నాడు, నల్లటి జుట్టు బిరుసుగా వున్నా క్రాఫ్ అందంగా వుంది.

"నమస్తే! నా పేరు అమరనాథ్. పెళ్ళికూతురు నా చెల్లెలు" అన్నాడు రెండుచేతులు జోడించి నమస్కారంచేస్తూ.

అతనిలోని వినయం, కంఠంలోని మృదుత్వం, కదలికలలోని నమ్రత నన్నెంతో ఆకర్షించాయి.

"ఏం చేస్తున్నారు ?" అడిగాను.

"హెచ్. ఎమ్. టి.లో పనిచేస్తున్నాను."

"అంటే ! హైద్రాబాద్‌లోనా ?"

"అవును"

"ఎక్కడ మీరు వుండేది ?"

"కాలనీలో....మీరు ?"

"చార్‌మినార్ చౌరస్తా దగ్గర"

"బయల్దేరుదామా మా నాన్నగారికి తిథి, వారం మొదలైన వాటి మీద నమ్మకం ఎక్కువ" చెప్పాడు అమర్‌నాథ్.

అతనే రెండు రిక్షాలు మాట్లాడి తెచ్చాడు. ఒకదాంట్లో నేను, పెద్దన్నయ్య ఇంకో దాంట్లో సత్యానంద్, అమర్‌నాథ్ కూర్చున్నాము.

దారిలో చెప్పాడు పెద్దన్నయ్య.

"పిల్లని వదిన చూసిందని రాశాగా. మంచి సాంప్రదాయమైన కుటుంబం. మంచి మనుషులని తెలిసిన వాళ్ళంతా చెప్పారు. అయితే అట్టే కట్నం ఇచ్చుకోలేకపోయినా మర్యాదలు మొదలయినవి ఉన్నంతలో ఘనంగా చేస్తారు. పి.యు.సి. దాకా చదివించి ఆపేశారు. ఇంటిపనంతా ఆ అమ్మాయే చేస్తుందిట....నువ్వే చూస్తావుగా."

హనుమాన్ పేటలోని ఓ పెంకుటింటి ముందు ఆగాయి రిక్షాలు. అమరనాథ్ రిక్షా వాళ్ళకి డబ్బులు తనే ఇచ్చాడు మమ్మల్ని ఇవ్వనివ్వకుండా. కాళ్ళు కడుక్కోడానికి గుమ్మం దగ్గరే బకెట్ నిండా నీళ్ళు, ఇత్తడి చెంబు వున్నాయి.

సత్యానంద్ కాళ్ళకి బూట్లు వుండటం చూసి చెప్పాడు అమరనాథ్.

"ప్లీజ్ ! మీరూ కనుక్కోండి. మా నాన్నగారు ఒట్టి చాదస్తం మనిషి ఇలాంటి విషయాల్లో."

పెళ్ళికూతురు తండ్రి స్వయంగా ఇస్త్రీ టవల్ తీసుకొచ్చి ఇచ్చాడు. తర్వాత లోపలికి ఆహ్వానించాడు.

వాళ్ళింట్లో ముందు గదిలోని చెక్కకుర్చీలు దాదాపు పుష్కరం వయసు కలిగి వుంటాయి.

కూర్చున్నాం.

"ముగ్గురొచ్చారు. ఆవిడ కూడా వస్తే బావుండేది ?" అన్నారాయన నవ్వి.

"నేనున్నానుగా వాళ్ళింట్లోంచి బయలుదేరింది నలుగురం కాబట్టి ఆ దోషం వుండదు" అమర్‌నాథ్ తండ్రికి చెప్పాడు.

స్టీల్ ప్లేట్లలో వేడి వేడి పకోడీలు తెచ్చింది అమర్‌నాథ్ ఆఖరి చెల్లెలు.

పెళ్ళికూతురు తండ్రి పావుగంటసేపు వున్నదున్నట్లుగా తన స్థితి

గతుల గురించి చెప్పాడు. ఇద్దరు కూతుళ్ళ పెళ్ళికెదిగి వున్నారు. ఇంకో పిల్ల ఇవాళో, రేపో పెళ్ళికి సిద్ధమవుతుంది. అమరనాథ్ ఒక్కడే కొడుకు. ఆ ఇల్లు ఒక్కటే స్థిరాస్థి. ఉద్యోగంలోంచి రిటైరయి రెండేళ్ళు కావస్తోంది. కొడుకు జీతంతోనే ఇల్లు గడుస్తోంది.

నేల మీద చాప పరిచింది ఆయన భార్య. తర్వాత తన కూతురిని తీసుకువచ్చి కూర్చోబెట్టింది ఇరవై ఏళ్ళు వుంటాయి ఆ అమ్మాయికి. నాజూకుగా, అందంగా వుంది.

ప్రతీ మొగాడు కన్నార్పకుండా చూడాలనిపించేటంత అందం కాదది. మృదువైన అందం. ఆహ్లాదంగా వుండే సౌందర్యం.

"నీ పేరేమిటమ్మా ?" అడిగాడు పెద్దన్నయ్య.

చెప్పింది.

ఇంకో నాలుగయిదు ప్రశ్నలు వేశాడు. కేవలం ఆ అమ్మాయి కంఠం, మాటతీరు తెలుసుకోవాలని వేసిన మామూలు ప్రశ్నలవి.

అరగంట తర్వాత లేచాం బయలుదేరడానికి. ముగ్గురం వెళ్ళడానికి ఒప్పుకోలేదు పెళ్ళికొడుకు తండ్రి.

"మీరెన్నయినా చెప్పండి. మా అబ్బాయి కూడా వస్తాడు మీ ఇంటి దాకా మూడు సంఖ్య మంచిది కాదు నా చాదస్తం నాది."

అమరనాథ్ మమ్మల్ని ఇంటి దగ్గర దింపాడు రిక్షాలో వెళ్తూ చెప్పాడు.

"రేపటితో నా శెలవు అయిపోతుంది. హైద్రాబాదు వెళ్ళిపోతున్నాను రాత్రి బస్సులో. ఎల్లుండి మా నాన్నగారు వచ్చి మాట్లాడతారు మీతో రేపు మంచిది కాదట."

మర్నాడు ఉదయం అడిగింది వదిన సత్యానంద్‌ని.

"ఎలా వుంది పిల్ల ?"

"బావుంది."

"బావుందా ? చాలా బావుందా ? ?" నవ్వింది.

"చాలా బావుంది."

"అయితే నచ్చినట్లేనా ?"

"చాలా నచ్చినట్లే !"

నవ్వాడు సత్యానంద్. ఆ నవ్వులో చూచాయగా సిగ్గు కనపడింది నాకు.

"రేపు మీ కాబోయే మామగారొస్తారు. మంచిరోజు చూసి తాంబూలాలు పుచ్చుకుంటాం అయితే."

తల వూపాడు.

పట్నం దగ్గిర అట్టే బేరం ఆడలేదు పెద్దన్నయ్య మర్నాడు ఆయన వచ్చాక. గంటలో అన్ని విషయాలు మాట్లాడుకున్నారు. తాంబూలాలు పుచ్చుకోడానికి తేదీని నిర్ణయించారు.

"మొత్తానికి మా చిన్నమరిది అదృష్టవంతుడే" అన్నది వదిన సంతోషంగా.

"బాబాయ్ నీ పెళ్ళి కుదిరిందిగా మమ్మల్నందరినీ సినిమాకి తీసుకెళ్ళు"

అన్నయ్య పిల్లలు సత్యానంద్ చుట్టూ మూగారు. ఆ రాత్రే మేం బయలుదేరి వచ్చేశాం హైద్రాబాద్.

* * *

అమర్‌నాథ్‌తో వచ్చినతని వంటిమీద తెల్లటి యూనిఫాం వుంది, అమరనాథ్ వంటిమీద కూడా. ఇద్దరి చొక్కాజేబుల మీద 'సి.బి' అనే ఇంగ్లీష్ అక్షరాలు ఎర్రరంగు దారంతో కుట్టి వున్నాయి.

"సోడా ఓపెనర్‌తో తెరుస్తూంటే చేతిలో పగిలింది. చెయ్యి అడ్డు పెట్టాడు. లేకపోతే అసలు మొహానికే తగలాల్సింది దెబ్బ" చెప్పాడు రెండో అతను.

"మీరెక్కడా పని చేసేది ?" అడిగాను.

అమరనాథ్ చెప్పలేదు జవాబు కూడా వచ్చి నతనే చెప్పాడు.

"క్రిస్టల్ బార్‌లో బేరర్స్‌గా పని చేస్తున్నాం ఇద్దరం."

అమరనాథ్ కుర్చీలోంచి లేచి చెప్పాడు.

"థాంక్స్ వెళ్ళొస్తాం."

అప్పటికే అతని మొహం అవమానంతో, లజ్జతో ఎర్రబడిపోయి వుంది.

"ఓ ఇంజెక్షన్ ఇస్తాను. సెప్టిక్ అయితే ప్రమాదం."

అమర్‌నాథ్‌ని నా కన్సల్టింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళాను. అతని మనసులోని ఆలోచనలని అర్థం చేసుకోగలిగాను.

ఓ బార్‌లో బేరర్‌గా పని చేస్తూ, పూర్వాచార పరాయణుడయిన తండ్రి నుంచి ఆ సంగతి దాచి వుంచాడు. కారణం-అమర్‌నాథ్ జీతం వల్లే వాళ్ళ ఇల్లు గడుస్తోంది.

బేరర్‌కి ఎంతొస్తుంది జీతం? బహుశ కష్టమర్స్ అతనిలోని నమ్రతని, వినయాన్ని చూసి టిప్స్ అధికంగా ఇస్తుండచ్చు. ఆ టిప్స్ డబ్బు దాచి చెల్లెలు పెళ్ళికి కట్నంగా జమచేస్తూ వుండివుండొచ్చు. వంద రూపాయల బిల్లు అయితే కనీసం ఐదయినా టిప్ దొరుకుతుంది. రోజుకు అలాంటి కష్టమర్స్ ఇద్దరు దొరికితే చాలు. అనేకమంది టిప్స్ రూపంలో దానం చేసిన సొమ్ముని అమరనాథ్ కట్నంగా ఇస్తున్నాడనిపించింది నా తమ్ముడు సత్యానంద్‌కి.

అతని మొహంలోని, ఆత్రుతని, బాధని గ్రహించి, అతని భుజం మీద చెయ్యివేసి లాలనగా చెప్పాను.

"వచ్చేనెల నాలుగో తారీకే పెళ్ళి. పెళ్ళి పందిట్లో కలుసుకుందాం"

నమ్మలేనట్లుగా చూశాడు నావంక.

"కొంతమంది మనుషులకుండే మనసులు మంచివి కావు. సెప్టిక్

చేసే విషక్రిములకన్నా హీనమయినవి. కానీ కొంతమంది మనసులు ఎలాంటివో తెలుసా ?"

ఆగి నవ్వుతూ చెప్పాను.

"ఏంటిసెప్టిక్ హార్ట్స్."

అమరనాథ్ మొహంలో చిరునవ్వు చోటు చేసుకుంది నెమ్మదిగా.

"మీది ఏంటీ సెప్టిక్ హార్ట్ అన్నానని రోజూ ఎంటీసెప్టిక్ ఇంజెక్షన్ తీసుకోవటం మర్చిపోకండి. మూడురోజులు వచ్చి ఇంజెక్షన్ తీసుకోండి" చెప్పాను.

"మూడు రోజులు కాదు సార్, నాలుగు రోజులు వస్తాను. మూడు అంకె మంచిది కాదు."

అమర్‌నాథ్ కృతజ్ఞతగా అన్నాడు రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ.

"యు ఆర్ వెరీగుడ్ ఎట్‌హార్ట్. హోదా, స్థాయి అనుకోకుండా దొంగతనం, వ్యభిచారంలాంటి చెడ్డపనులు చేయనంతకాలం, ఇలాంటి ఉద్యోగాలు ఏం చేసినా తప్పులేదు" అన్నాను అతని భుజంతట్టి.

(విపుల 1979)